క్లుప్తంగా

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు



కోంటూర్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని కోంటూర్ చెరువులో వినాయకులను నిమజ్జనం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వచ్చే వినాయకులు క్యూ పద్ధతిన వచ్చి క్రేన్‌తో చెరువులో వేసిన అనంతరం తిరిగి వెళ్లేందుకు రెండు వైపుల రోడ్లను ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు చేపడుతున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పైతర గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో కేంద్రంలోని ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ప్రజలు బీజేపీపై పూర్తి నమ్మకంతో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాని, బూత్ అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

నర్సాపూర్: విశ్వకర్మ జయంతి ఉత్సవాలు 17న చేపట్టనున్నట్లు విశ్వకర్మ మనుమయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృపాచారి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచింతకుంట స్టేజీ సమీపంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు నరేందర్‌చారి, కాళీదాస్‌చారి, అంజయ్యచారి, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అల్లాదుర్గం(మెదక్): రోడ్డు ప్రమాదంలో బైక్‌పై నుంచి కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండలం నడిమితండాకు చెందిన గుగులోత్ హన్మంతు(42), అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి గ్రామంలో ఇటాచ్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 12న పెద్ద శంకరంపేట నుంచి అప్పాజీపల్లి బైక్‌పై వస్తుండగా అల్లాదుర్గం శివారులోని 161 నేషనల్ హైవేపై అదుపుతప్పి బైక్‌పై నుంచి కింద పడ్డట్లు ఎస్‌ఐ తెలిపారు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

డీజే, లైటింగ్ పెడితే చర్యలు

అల్లాదుర్గం(మెదక్): గణేశ్ నిమజ్జనంలో భాగంగా శోభయాత్రలో డీజే, లేజర్ లైటింగ్ పెడితే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. నిమజ్జన యాత్రలో డీజే, లేజర్ లైటింగ్‌కు ఎలాంటి అనుమతులు లేవన్నారు. లేజర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే గణేశ్ మండప నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు. గణేశ్ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, శోభయాత్రలో చిన్నపాటి శబ్దంతో కూడిన సౌండ్‌ను పెట్టుకొని నిమజ్జనం చేసుకోవాలని తెలిపారు. నిమజ్జనం చేసే చెరువు వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

అంగరంగ వైభవంగా వినాయక కల్యాణోత్సవం



మెదక్ పట్టణం సాయినగర్ కాలనీలో వినాయకుడి పూజల్లో భక్తులు

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మణికంఠ గణేశ్ మండపంలో సోమవారం సాయంత్రం గణపతి సిద్ధి బుద్ధి వినాయక కల్యాణం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వినాయక కల్యాణంలో గుండు రమేశ్ - వినోద, పోలా ప్రవీణ్-రేణుక, పోలా శశికుమార్-ప్రసన్న, సిద్ధిరాములు, పుల్లయ్య దంపతులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాశ్వత భవనాలు ఏర్పాటయ్యేనా?

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



చిలప్‌చెడ్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న రెవెన్యూ కార్యాలయం

చిలప్‌చెడ్(నర్సాపూర్): పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం నూతన మండలాలు ఏర్పాటు చేసింది. అందులో భాగంగానే 2016 అక్టోబర్ నెలలో చిలప్‌చెడ్‌ను మండలంగా ఏర్పాటుచేశారు. కానీ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. చిలప్‌చెడ్ మండలంగా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు ప్రభుత్వ కార్యాకలాపాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఎంపీడీఓ, ఉపాధి కార్యకలాపాలు ముదిరాజ్ సంఘ భవనంలో, పోలీస్‌స్టేషన్ గోపాలమిత్ర భవనంలో నడుస్తుండగా, రెవెన్యూ, ఐకేపీ కార్యకలాపాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో మూడు పల్లె దవాఖానలు ఏర్పాటైనప్పటికీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేదు. దీంతో మండల ప్రజలు అత్యవసర వైద్య సేవల కోసం కొడిపల్లి, జోగిపేటకు వెళ్తున్నారు. ఇక మండలంలో చిట్కుల్ గ్రామంలో ఏకైక పశువైద్యశాల ఉంది. అదీ సైతం శిథిలావస్థలో ఉంది. వ్యవసాయశాఖ అధికారులకు ప్రత్యేక కార్యాలయాలు ఏమీ లేవు. రైతు వేదిక భవనాలల్లోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ఇక మిగతా శాఖలకు సంబంధించిన కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో, వాటికి సంబంధించిన అధికారులు ఎవరో సైతం మండల ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. గతంలో మండలంలో కొత్త ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మిస్తామని అధికారులు పలు చోట్ల భూముల సర్వే చేశారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సైతం భూములను, సర్వే రిపోర్టులను పరిశీలించి, ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అది కలగానే మిగిలింది. శీలాంపల్లి గేటు వద్ద పోలీసు ఉన్నతాధికారులు, పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినా.. అది జరగలేదు. మండల కేంద్రంగా చిలప్‌చెడ్ ఎలాంటి అభివృద్ధి చెందలేదని, మండలంగా ఏర్పాటైనప్పటికీ, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు తప్పడం లేదని మండల ప్రజలు అంటున్నారు.



మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి స్థల మ్యాప్ చూపిస్తున్న సర్వేయర్ (ఫైల్)

ఇబ్బందులు పడుతున్నాం



చిలప్‌చెడ్ మండలం ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు కనీసం ఒక్క ప్రభుత్వం కార్యాలయ భవనం నిర్మించలేదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రంలో ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో, రెవెన్యూ, పోలీస్, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ, ఐకేపీ మినహా ఏ కార్యాలయాలు అందుబాటులో లేవు. దీంతో మండల ప్రజలు ఏవైనా పనులు చేసుకోవాల్సి వస్తే కొడిపల్లి మండలానికి వెళ్తున్నాం.

– చంద్రశేఖర్‌రెడ్డి, చండూర్ గ్రామస్తుడు

ఎలాంటి పురోగతి లేదు



రెవెన్యూ శాఖకు ప్రత్యేక భవనం లేదు. ప్రస్తుతం రెవెన్యూ కార్యకలాపాలు అద్దె భవనంలో కొనసాగిస్తున్నాం. ఇబ్బందులు ఎదురవుతున్న పనులు చేస్తున్నాం. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్లు ప్రభుత్వ భవనాల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించారు. ప్రస్తుతం నూతన భవనాల గురించి ఎలాంటి పురోగతి లేదు.

– ముసాద్దిక్. తహసీల్దార్, చిలప్‌చెడ్

పంట కాల్వ కబ్జాపై రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): పంట కాల్వ కబ్జా చేయడంపై రైతులు సోమవారం ఆందోళన చేశారు. మండల పరిధిలోని దంతన్‌పల్లి గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి రైతుల నుంచి పట్టా భూములు కొనుగోలు చేసి ఫామ్ హౌస్ నిర్మాణం చేపట్టాడు. రైతుల పొలాలకు నల్లకుంట నుంచి వచ్చే పంట కాల్వను కబ్జా చేసి సిమెంట్ పలకలతో గోడను నిర్మిస్తున్నాడు. కాల్వను అలాగే ఉంచాలని రైతులు పలుమార్లు ఫామ్ హౌస్ యజమాని దృష్టికి తీసుకెళ్లినా.. స్పందించలేదు. పొలాలకు సాగు నీటి కోసం నక్ష ప్రకారం ఉన్న పంట కాల్వను తొలగించి రైతుల పొలాల నుంచి కొత్తగా కాల్వ నిర్మాణం చేపట్టడడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నక్ష ప్రకారం ఉన్న పంట కాల్వను పునరుద్ధరించాలని రైతులు గడ్డం రాజు, నాగభూషణం, పెంటయ్య తదితరులు డిమాండ్ చేశారు. సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి.. పంట కాల్వను కబ్జా చేసి, తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు.

విచ్చలవిడిగా కల్తీ కల్లు విక్రయాలు

- పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్వచ్ఛమైన కల్లు పేరుతో మత్తు పదార్థాలు కలిపి కల్లు విక్రయిస్తున్నా.. ప్రజలు కల్లుకు బానిసలవుతున్నారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో జోరుగా కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, నెల నెల మాముళ్లు తీసుకెళ్తున్నట్లు విమర్శిస్తున్నారు. కల్లు దుకాణం గ్రామానికి చివరలో ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కల్తీకల్లు సేవించేందుకు కాయిదంపల్లి, నీలకంఠిపల్లి, కోలపల్లి, లక్ష్మాపూర్, బుర్గుపల్లి గ్రామాల నుంచి ప్రజలు వస్తున్నారని చెప్పారు. కల్లు దుకాణంలో మత్తులో గొడవలు జరుగుతున్నట్లు వారు తెలిపారు. కాయిదంపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి మరో వ్యక్తితో గొడవ పడటంతో సీసాతో తలపై దాడి చేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. కల్లు దుకాణం ఆవరణలో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. కొంత మంది యువకులు గంజాయిని సిగరెట్లలో నింపుకొని తాగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు విచారణ చేసి, కల్తీకల్లు, గంజాయి విక్రయాలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'అట్రాసిటీ కేసు నమోదు చేయాలి'

నర్సాపూర్: దళితులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన వారందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం పార్టీ నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మనోహరబాద్ మండలంలోని గౌతోజిగూడ గ్రామంలో డప్పు కొట్టకుంటే కుల బహిష్కరణ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. కుల వృత్తినేపంతో డప్పు కొట్టకుంటే గ్రామం నుంచి బహిష్కరిస్తామని, ఎదురు మాట్లాడితే జరిమానా విధించడంతో పాటు చెప్పుదెబ్బలు కొడతామని తీర్మానం చేసిన గ్రామ పెద్దలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

మహిళలకు పోషకాహారంపై అవగాహన



ఐకేపీ కార్యాలయంలో పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో డ్వాక్ర మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించి, పోషణ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు. సోమవారం కౌడిపల్లి రెండవ గ్రామసంఘం సమావేశం ఐకేపీ కార్యాలయంలో వీఓఏ ఏసు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్వాక్ర మహిళలు తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా చెల్లించి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రంలో మహిళ సంఘం సభ్యులు పూర్ణిమ, అనసూయ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

'కుల బహిష్కరణ పూర్తి అవాస్తవం'



మాట్లాడుతున్న మాల కులస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని కొప్పులపల్లిలో మూడు కుటుంబాలను తాము బహిష్కరించినట్లు వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తమని గ్రామంలోని మాల కులస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం కాలనీలోని ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్ నుంచి ఓ యువకుడు పెట్రోల్ చోరీ చేసిన విషయంలో తమ కులానికే చెందిన ఇరువర్గాల మధ్య గొడవ జరిగిందన్నారు. ఈ విషయంలో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. చోరీ విషయాన్ని పక్కదారి పట్టించేలా గ్రామానికి చెందిన నాగరాజు, శివయ్య, గాలవ్వ కుటుంబ సభ్యులను తాము వెలివేసినట్లు తప్పుడు ఆరోపణలు చేయడం విచారకరమన్నారు. తాము ఎవరినీ కులం నుంచి బహిష్కరించలేదని, గ్రామంలోని 37 కుటుంబాలకు చెందిన మాల కులస్తుల మంతా ఒక్కటిగానే కలిసి ఉన్నామన్నారు. తరచుగా ఇళ్ల ఎదుట కుంకుమ, పసుపు, నిమ్మకాయలు ఉంటున్నాయని ఈ విషయంలో పోలీసులు విచారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కొల్చారం(నర్సాపూర్): మహమ్మద్ ప్రవక్త జన్మదిన మిలాద్ ఉన్ నబీ వేడుకను సోమవారం మండల వ్యాప్తంగా ముస్లింలు వేడుకగా జరుపుకున్నారు. వేడుకలో భాగంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్, కాళ్లకల్, ముప్పిరెడ్డిపల్లి, లింగారెడ్డిపేట్ గ్రామాల్లో మసీద్‌ల్లో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో మనోహరాబాద్‌లో తూప్రాన్ పీఏసీఎస్ డైరెక్టర్ జావీద్ పాషా, షర్ఫొద్దీన్, తౌఫీక్, మునావర్, సమద్, లాయిక్, రజాక్, ఫహీం, అదిల్, మాజ్, యాసిన్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్‌లో సోమవారం మిలాద్ ఉన్ నబీ జల్సా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కింది వాడ నుంచి బస్టాండ్‌లోని దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా వినాయక నవరాత్రులు



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలో మహిళలు

జిల్లా వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో గణపతులను డోలు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు.



నర్సాపూర్: నిమజ్జనంలో పాల్గొన్న యువకులు



శివ్వంపేటలో నిమజ్జనానికి తరలుతున్న బాల గణేశుడు



కౌడిపల్లి(నర్సాపూర్): కొట్టాలలో..



పెద్దశంకరంపేటలో..



పాపన్నపేట(మెదక్): విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేస్తున్న భక్తులు



నర్సాపూర్‌లోని గరుడసేన ఆధ్వర్యంలో గణేశుడికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



కౌడిపల్లిలో వినాయక నిమజ్జన ఊరేగింపు



కొల్చారం(నర్సాపూర్): నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



టేక్మాల్(మెదక్): వెల్పుగొండలో..

సంక్షిప్త వార్తలు

◆ చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట్ జిల్లా వర్గల్ మండలం ఏలూర్ గ్రామానికి చెందిన మహ్మద్ నజీర్ పురుగుల మందు తాగాడు. దీంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

◆ రైతులకు పట్టాపాస్‌బుక్ ఇవ్వండి

కౌడిపల్లి(నర్సాపూర్): కాస్తులో ఉన్న రైతులకు పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని వెంకట్రావ్‌పేటలో రైతులతో మాట్లాడుతూ... గ్రామంలో సర్వేనంబర్ 316లో సుమారు 70ఎకరాల్లో 70 మందికి పైగా రైతులు కాస్తులో ఉండి ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నారని చెప్పారు. కాగా కేవలం 30మందికి మాత్రమే ప్రభుత్వం పట్టాదారు పాస్‌బుక్ ఇచ్చిందని, మిగతా వారికి ఇవ్వలేదన్నారు. అధికారులు సర్వేచేసి వెళ్లిన ఇంతవరకు లబ్ధిదారులకు పాస్‌బుక్ అందలేదన్నారు. దీంతో రైతులకు సాగు రుణాలు అందడంలేదన్నారు. అధికారులు స్పందించి కాస్తులో ఉండి పంటలు సాగు చేస్తున్న రైతులకు పట్టాదారు పాస్‌బుక్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు నర్సమ్మ, రైతులు పాల్గొన్నారు.

◆ షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి కృషి

దౌల్తాబాద్ (దుబ్బాక): రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతంను ఆయన నివాసంలో సోమవారం కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభ్యున్నతికి పని చేస్తానని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం చెప్పారని స్వామి తెలిపారు.

◆ వ్యక్తి అదృశ్యం



చేగుంట(తూప్రాన్): వ్యవసాయ పలంవద్ద ఉన్న గేదెలను చూసేందుకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మక్కరాజీపేట గ్రామానికి చెందిన అంతు నర్సయ్య నెల 14న పొలం వద్ద ఉన్న గేదెలను చూసేందుకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయేవరకు నర్సయ్య ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల ఇళ్లలో వెతికినా.. ఆచూకీ లభించలేదు. అతడి కుమారుడు అంతు సిద్ధిరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2006–07 పదోతరగతి పూర్వవిద్యార్థులు ఒకేచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పరశురాములు, శారద, కవిత, శ్రీవాణి, శిరీష, శోభ, నిర్మల, నవనీత, జీవన్, దాసు, యాదగిరి, అనంతం, శ్రీకాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.